క్లుప్తంగా

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా



రైతుల సమస్యలను పరిష్కరిస్తున్న ఏడీఈ

పెనుమూరు(కార్వేటినగరం): రైతులకు, వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని చిత్తూరు రూరల్ ఏడీఈ /జ్ఞానేశ్వర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మతంపల్లి సబ్‌స్టేషన్‌లో ఏఈ తులసీప్రసాద్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారులతో సమావేశం నిర్వహించారు. ఏడీఈ మాట్లాడుతూ విద్యుత్ సమస్యలకు వీలైనంతవరకు పరిష్కారం చూపాలని, లేని పక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. వ్యవసాయ సర్వీసులకు కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి సీనియారిటీ ప్రకారం సర్వీసులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఈక్రమంలో పలువురు సమస్యలపై వినతులు అందించడంతో వాటిలో 5 సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని ఉన్నతాధికారులకు నివేదించి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. రైతులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశాల పాత్ర కీలకం



రికార్డులు పరిశీలిస్తున్న వెంకటప్రసాద్

పాలసముద్రం: మాతాశిశు సంరక్షణలో ఆశా కార్యకర్తల పాత్ర కీలకమని జిల్లా క్షయవ్యాధి ఆఫీసర్ వెంకటప్రసాద్ తెలిపారు. మంగళవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ ఆధ్వర్యంలో ఆశా కార్యాకర్తలకు మాతాశిశు సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెంకటప్రసాద్ మాట్లాడుతూ గర్భిణులకు ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే పీహెచ్‌సీకి తీసుకురావాలని సూచించారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆశా కార్యకర్తలు గ్రామాల్లో ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి జ్వరాలను సర్వే చేయాలని, పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు వివరించాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తే దోమల వల్ల వచ్చే విషజ్వరాల బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. అనంతరం పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేశారు. సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సుశీల, మురళి, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలి



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలని ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. మంగళవారం బాలక్రిష్టాపురం ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు వేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు మంచి పౌష్టికాహారం పెట్టాలనే ఉద్దేశంలో ప్రభుత్వం రోజుకొక మోనూతో భోజనం పెడుతున్నారన్నారు. అనంతరం విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను మధ్యాహ్న భోజనం రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట విస్తరణాధికారి రమేష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలాన్ని పరిరక్షించండి



వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

పుత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని చెర్లోపల్లి ఆదిఆంధ్రవాడకు చెందిన శాంతినగర్ శ్మశాన స్థలాన్ని కబ్జా చేస్తున్నారని, ఈ స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గ్రామస్తులు మాట్లాడుతూ కొందరు శ్మశాన స్థలంలోనే రోడ్డు వేసి తమ రియల్ ఎస్టేట్ వ్యాపారాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. అక్రమ రోడ్డు నిర్మాణాన్ని తొలగించి శ్మశాన స్థలాన్ని రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అక్రమంగా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దారు వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ శ్మశాన స్థలాన్ని సర్వే చేసి, గ్రామస్తులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు నాగభూషణం, మాతయ్య, హరి, సుధా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఉద్వాసన!

- మద్యం షాపుల్లోని ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరం
- కూటమి ప్రభుత్వ నిర్ణయంతో అయోమయం
- అక్టోబర్ 1వ తేదీ నుంచి నూతన మద్యం పాలసీ
- ఉద్యమబాటలో ఉద్యోగులు
- సీఎం చంద్రబాబుకు బహిరంగలేఖ
- మద్యం షాపుల కోసం కూటమి నేతలు ప్రయత్నాలు
- మళ్లీ పుంజుకోనున్న బెల్ట్ షాపులు



ప్రభుత్వ మద్యం దుకాణం

శ్రీరంగరాజపురం: రాష్ట్రంలో కూటమి పాలకుల నిర్ణయాలతో ప్రస్తుతం మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి అయోమయంలో ఉంది. గతంలో వలంటీర్ వ్యవస్థ, నేడు మద్యం దుకాణాల్లోని ఉద్యోగులలు, రేపు ఎవరో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం రాష్ట్రంలో మద్యం కొత్తపాలసీని ప్రవేశపెట్టనుండడంతో ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేస్తున్నా వారిని తొలగిస్తారా.. లేక కొనసాగిస్తారా అనే ఆందోళనలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని అక్టోబర్ ఒకటి నుంచి అమలు చేస్తామని ప్రకటించింది. ఇదే విషయంపై ఆ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తాజాగా మెరుగైన మద్యం పాలసీ రూపొందిస్తామని ధరలు కూడా తగ్గిస్తామని ప్రకటించారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం విధానం రూపకల్పనకు మంత్రి వర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మద్యం దుకాణాలకు బదులు ప్రైవేటు ఏజెన్సీలకు నిర్వహణ అప్పగించే అవకాశం కనిపిస్తోంది. దీంతో మద్యం షాపుల్లో పనిచేసే ఉద్యోగులు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేలకు వినతి పత్రం అందించారు. తమ ఉద్యోగం ఉంటుందో లేక ఊడుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 113 మద్యం షాపులు

చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 113 మద్యం షాపు దుకాణాలు ఉన్నాయి. వీటిలో పట్టణాలు, మండలం హెడ్‌క్వార్టర్‌లో ఉన్న ప్రతి మద్యం దుకాణానికి ఒక సూపర్‌వైజర్, ముగ్గురు సేల్స్‌మన్, ఒక వాచ్‌మెన్ ఉంటారు. ఆ లెక్కన ఎక్సైజ్ పరిధిలో 113 మద్యం దుకాణాల్లో 565 మంది వరకు ఉద్యోగాలు చేస్తున్నారు. వీరిలో సూపర్‌వైజర్‌కు రూ.19500, సేల్స్ మెన్‌కు రూ.16500, వాచ్‌మెన్‌లకు రూ.10 వేలు జీతం ప్రభుత్వం నుంచి అందుతోంది.

గత టీడీపీ పాలనలో ఇలా...

2019కి ముందు టీడీపీ పాలనలో మద్యం దుకాణాల నిర్వహణకు ప్రతి రెండేళ్లకు ఒక సారి టెండర్లు పిలిచేవారు. లాటరీల ద్వారా దుకాణాలు కేటాయించేవారు. మహిళలు సైతం టెండర్లలో పాల్గొనేవారు. కొన్ని ముఖ్యమైన దుకాణాలకు మంచి డిమాండ్ ఉండేది. అవన్నీ రాజకీయ నాయకుల అజమాయిషీలో ఉండేది. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం అవినీతికి ఏ మాత్రం తావు లేకుండా ప్రైవేటు దోపిడీని అరికట్టేందుకు మద్యం దుకాణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అవినీతి, అక్రమాలకు చెక్ పెట్టింది. అంతేకాకుండా గ్రామాల్లో బెల్టు షాపులకు, సారా అమ్మకాలకు సైతం అడ్డుకట్ట వేసింది.

వైఎస్ఆర్ సీపీ పాలనలో ఉపాధి

వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధినిచ్చింది. దాదాపు ఐదేళ్లపాటు ఎటువంటి కష్టాలు లేకుండా వారు ప్రభుత్వ దుకాణాల్లో పని చేయడంతో ఆ కుటుంబాలకు జీవనోపాధి కలిగింది. ఇప్పుడు ఉన్న కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీతో అందులో పని చేస్తున్నవారి ఉద్యోగాలు ప్రశ్నార్థకంగా మారాయి.

కూటమి పాలనలో అనిశ్చితి

కూటమి పాలనలో నూతన మద్యం పాలసీ కారణంగా ప్రైవేటు ఏజెన్సీలు మద్యం షాపులను నిర్వహించే పరిస్థితి కనిపిస్తోంది. దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియ సైతం కొనసాగుతోంది. మద్యం పాలసీతో అంతిమంగా లబ్ధి పొందేది కాంట్రాక్టర్లు, కూటమి నేతలేనని ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. కూటమి నేతలు మద్యం దుకాణాల నిర్వహణకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది. ఇక ప్రభుత్వం మద్యం షాపుల సిబ్బందిని కొనసాగిస్తారా లేక తొలగిస్తారా అనే విషయంపై స్పష్టత లేదు. ఒక వేళ తమను విధులు నుంచి తొలగిస్తే ఆందోళన బాట పట్టక తప్పదని వారు స్పష్టం చేస్తున్నారు.

బెల్టు షాపుల వస్తాయని ఆందోళన



వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా మా గ్రామంలో బెల్టుషాప్ లేకుండా పోయింది. ప్రస్తుతం కూటమి పాలన నిర్ణయంతో మళ్లీ మా గ్రామాల్లోకి ఎక్కడ మద్యం వస్తుందో అని భయంగా ఉంది. ప్రతి రోజూ నేను నా భర్త కష్టపడి పని చేస్తే వచ్చే కూలీ డబ్బులు పొదుపు చేసుకుని జీవిస్తున్నాం . బెల్టుషాపులు వస్తే మా పరిస్థితి దారుణమవుతుంది. – పి.దేవమ్మ, గంగాధరనెల్లూరు

ఉద్యోగాలు తొలగిస్తే బంద్

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్నా సెల్స్ మెన్‌లు, సూపర్‌వైజర్‌లు, వాచ్‌మెన్‌లు భవిష్యత్‌పై ఒక ప్రకటన చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సంబంధిత మంత్రిని డిమాండ్ చేస్తూ ఒక లేఖ రాశారు. ఈ మేరకు ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను గతంలో మీడియాకు విడుదల చేశారు. ఈ లేఖలో గత ప్రభుత్వం 2019లో జాయింట్ కలెక్టర్ ద్వారా తాము నియమితులమయ్యామని కరోనా సమయంలో ప్రభుత్వ ఆదాయం తగ్గకూడదని ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పని చేశామని పేర్కొన్నారు. నూతన మద్యం పాలసీతో తమ ఉద్యోగ భద్రతపై ఆందోళన కలుగుతోందన్నారు. రాష్ట్రంలో 15 వేల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 7 నుంచి బంద్‌కు సైతం పిలుపునిస్తామని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాశల రామచంద్రరావు స్పష్టం చేశారు.





ఉద్యోగ భద్రతపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పణ, కొనసాగించాలని కోరుతున్న ఉద్యోగులు

మోస్తరు వర్షం



చెంచుగుడిలో కురుస్తున్న వర్షం

వెదురుకుప్పం: మండలంలో మంగళవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. వెదురుకుప్పం, పచ్చికాపల్లం, తిరుమలయ్యపల్లె, మాంబేడు ప్రాంతాల్లో వర్షం కురవడంతో రోడ్లు, వీధులు జలమయమయ్యాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పొలాల్లోకి నీళ్లు చేరాయి. అంతకుముందు ఉక్కపోతతో ఇబ్బంది పడ్డ జనం సాయంత్రం మోస్తరు వర్షంతో వాతావరణం చల్లబడింది. ప్రజలు సేదదీరారు.

పోషణ అభియాన్‌పై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ దుర్గాదేవి

గంగాధర నెల్లూరు: పోషణ అభియాన్, డీ వార్మింగ్ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆవశ్యకతను ఆశావర్కర్లు తెలియజేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ దుర్గాదేవి అన్నారు. ఆశాడే సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు పోషణ అభియాన్, ఇమ్యూనిజేషన్, డీవార్మింగ్ కార్యక్రమాలు అమలు చేయాలని, ప్రజలకు వాటి ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని కోరారు. సీహెచ్‌ఓ శ్రీనివాసులు, హెచ్ఎస్ ధర్మేంద్ర, వైద్యసిబ్బంది భారతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వారపు సంతలపై నిర్లక్ష్యం

- వర్షపు నీటిలో వారపు సంత
- తడిసి ముద్దవుతున్న కూరగాయలు
- వెదురుకుప్పంలో అధికారుల నిర్వాకం



సంతలో వర్షానికి తడుస్తున్న కూరగాయలు

వెదురుకుప్పం: వారపు సంతలపై అధికారుల నిర్లక్ష్యం ఇటు వినియోగదారులకు అటు చిరు వ్యాపారస్తులకు శాపంగా మారింది. వర్షం వస్తే మడుగులను తలపిస్తున్న ప్రధాన రహదారులపై నిర్వహించే వారపుసంతలకు లాభం కంటే నష్టాలు కొనితెచ్చుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోందని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వెదురుకుప్పం, పచ్చికాపల్లం, మొరవ, దేవళంపేట ప్రాంతాల్లో జరిగే వారపుసంతలకు సరైన సముదాయాలు నిర్మించిన దాఖలాలు లేవు. దీంతో చినుకుపడితే చాలు సరుకులు తడిసి ముద్దవుతున్నాయని అంటున్నారు. ప్రధానంగా వెదురుకుప్పంలో ప్రతి మంగళవారం వారపు సంత పెద్ద ఎత్తున జరుగుతుంది. ఇక్కడ అధికారులే గేటు వసూలు చేస్తున్నారు. అయితే రోడ్డుకిరువైపులా సరుకులు విక్రయిస్తుండడంతో వర్షానికి సరుకులు పాడైపోతున్నట్లు అంటున్నారు. మంగళవారం సాయంత్రం మండల వ్యాప్తంగా మోస్తరు వర్షం కురిసింది. దీంతో వెదురుకుప్పంలో జరిగే సంత ప్రాంతంలో వర్షపు నీరు ప్రవహించడంతో కూరగాయలు, సరుకులు కొట్టుకుపోయినట్లు వ్యాపారులు చెస్తున్నారు. రోడ్లపైనే విక్రయాలు చేస్తుండడంతో ఎండలకు సరుకులు వాడుముఖం పట్టండంతో పాటు వర్షానికి తడిసి ముద్దవుతున్నాయని చిరు వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. పచ్చికాపల్లంలో ఆదివారం జరిగే సంతలోనూ ఇదే సమస్య ఉత్పన్నమవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వారపు సంతల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని చిరు వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

సబ్సిడీని సద్వినియోగం చేసుకోండి

శ్రీరంగరాజపురం: రైతులకు అందించే సబ్సిడీ ఉలవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి నర్మద తెలిపారు. ఆమె మాట్లాడుతూ వేరుశనగ వేయని రైతులు ప్రత్యామ్నాయ పంటల కింద రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడీ కింద ఉలవల విత్తనాలను అందిస్తోందన్నారు. అర్హులైన రైతులు పాసు పుస్తకం, ఆధార్,1బీ తీసుకొచ్చి సమీప రైతు సేవా కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలని అన్నారు.

గంగధరనెల్లూరులో..

గంగాధర నెల్లూరు: నేటి నుంచి వ్యవసాయ శాఖ ద్వారా ఉలవలు సబ్సిడీ ధరతో పంపిణీ చేస్తామని మండల వ్యవసాయ అధికారిని భవాని తెలిపారు. 200 క్వింటాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, ఉలవలు 80 శాతం సబ్సిడీతో రైతులకు రైతు సేవా కేంద్రంలో ఇస్తామని తెలిపారు. ఈ అవకాశాలన్ని మండలంలోని రైతులు వినియోగించుకోవాలని అన్నారు.

గంగ జాతరకు అంకురార్పణ



జాతర బండ వద్ద అంకురార్పణ పూజలో నిర్వాహకులు

నగరి: పట్టణ పరిధిలో నిర్వహించనున్న గంగ జాతరకు నిర్వాహకులు మంగళవారం అంకురార్పణ చేశారు. చావిడి ప్రాంతంలో గంగమ్మను ఉంచే బండ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి సామాలమ్మ ఆలయం వద్ద పూజలు చేసి గ్రామంలో చాటింపు వేయడంతో జాతర కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. జాతర నిర్వాహకులు మాట్లాడుతూ చేపట్టనున్న కార్యక్రమాలను వెల్లడించారు. ఆనవాయితీ ప్రకారం ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు పురవీధుల్లో గెరిగ ఊరేగింపు ఉంటుందన్నారు. 10వ తేదీ సాయంత్రం గ్రామ దేవతలు ఓరుగుంటాలమ్మ సప్తకన్యక అలంకరణలో, దేశమ్మ మహిషాసుర మర్దిని అలంకరణలో చావిడి ప్రాంతానికి వచ్చి చేరుతారన్నారు. రాత్రి గంగమ్మ దేవతను ఊరేగింపుగా తీసుకువచ్చి వేపాకు పందిరికి చేర్చుతామన్నారు. 11వ తేదీ బుధవారం పట్టణంలో గంగజాతర నిర్వహిస్తామన్నారు. ఆ రోజు సాయంత్రం బలిఅన్నం ఉత్సవం, డెవిల్ చంద్రు డ్రమ్స్, చీరాల వారి అమ్మవారి వేషధారణ, నృత్యాల వేడుకల నడుమ గంగమ్మ అమ్మవారిని పొలిమేరకు తీసుకెళ్లి నిమజ్జనం చేస్తామన్నారు. 12వ తేదీన బస్టాండు ప్రాంగణంలో పాటకచ్చేరి, 13వ తేదీన ఓరుగుంటాలమ్మ దేవతను రాజరాజేశ్వరి అలంకరణలో, దేశమ్మ దేవతను విజయలక్ష్మి అలంకరణలో పట్టణ పరిధిలో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఊరేగింపులో వాణియంబాడి, డ్రమ్స్, బళ్లారి డ్రమ్స్, రాజమండ్రి వారి కోయనృత్యాలు, కర్ణాటక వీరభద్రగ్రాస నాట్యం, బాణాసంచా వేడుకలు ఉంటాయన్నారు. కార్యక్రమాలకు సంబంధిత పోస్టర్లను జాతర కమిటీ పెద్దలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నరసింహారెడ్డి, జ్యోతి రెడ్డి, కృష్ణారెడ్డి, టీకేఎం శ్రీనివాసన్, చిరంజీవిరెడ్డి, దయానిధి, జ్యోతి నాయుడు, గుణశేఖర్, ఇంద్రయ్య, బాబురెడ్డి, శ్రీనివాసులు, మణిఆచారి, కోలాబాలాజీ, టీవీ వాసు, రాము, సేదు, హరిపోతన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చాటుబండి



చాటుబండి సందర్భంగా ఆరేటమ్మ, గంగమ్మల విశ్వరూప ప్రదర్శన



గెరిగ ఊరేగింపు

పుత్తూరు: గ్రామ దేవత గంగమ్మ జాతర చాటు బండి కార్యక్రమం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 7 గంటలకు స్థానిక శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజుల స్వామి ఆలయం నుంచి గెరిగ ఊరేగింపు ప్రారంభమైంది. రాత్రి 8 గంటలకు బజారు వీధిలోని గంగమ్మ ఆలయం నుంచి నిర్వాహకులు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా బయల్దేరి కాపువీధిలోని కేశావాచారి కుటుంబం వారు తయారు చేసిన చాటుబండికి పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి చాటుబండిని తీసుకుని మండపం వద్ద ఉంచి పూజలు చేశారు. ఊరేగింపుగా ఆరేటమ్మ ఆలయం వద్దకు వెళ్లి పసుపు కుంకుమను సమర్పించారు. దివిలి వెంకట్రాయులు మండడి కుటుంబం వారు చాటుబండి బలిదానం ఇచ్చారు. కుమ్మరి కన్నయ్య ఇంటికి వెళ్లి గంగపెట్టె తీసుకొని మండపం వద్దకు తీసుకొచ్చి అన్నంతో దీపం వెలిగించి పూజలు చేశారు. అనంతరం చాటుబండిని మంగళ వాయిద్యాలు, బాణాసంచా నడుమ కాపువీధి, బజారువీధి, నగరం రోడ్డు, అమ్మోరుగుంట వీధుల్లో ఊరేగించారు. బజారు వీధిలోని నాలుగు వీధుల కూడలి వద్ద చలువ పందిళ్లు, వస్త్రాలంకరణ, అమ్మవారి ఆలయానికి ప్రత్యేక విద్యుత్ దీప అలంకరణలు, ఇరువైపులా క్యూలైన్ల ఏర్పాట్లు పూర్తయ్యాయి. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వేపాకు తోరణాలు, అమ్మవారి ప్రతిమలతో కూడిన విద్యుత్ దీప కటౌట్లు ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం గంగమ్మ దర్శనమివ్వనుంది.

అక్రమంగా ఇసుక డంపింగ్

- వ్యక్తిపై కేసు



ఇసుకను సీజ్ చేసిన పోలీసులు

పాలసముద్రం: మండలంలోని పాలసముద్రం బీసీ కాలనీ సమీపంలో అక్రమంగా ఇసుకను డంప్ చేసిన వాసు మందడిపై మంగళవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ భారతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండలంలో అక్రమంగా ఇసుక డంపింగ్ చేసి రాత్రుల్లో తమిళనాడుకు తరలిస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు బలిజకండ్రిగ, పాలసముద్రంలో అక్రమంగా నిల్వవుంచిన ఇసుకను సీజ్ చేసి డంప్ చేసిన వాసు మందడిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. డంప్ చేసిన ఇసుక టీడీపీకి చెందిన వారివి కావడం గమనార్హం.

విజిబుల్ పోలీసింగ్‌తో పటిష్ట భద్రత

- నూతన సాంకేతిక పరిజ్ఞానం తప్పనిసరంటున్న పోలీసు శాఖ
- మారుతున్న కాలానికి అనుగుణంగా అత్యాధునిక నిఘా
- పటిష్ట నిఘా కిందకు నగరి పట్టణం – సీఐ మహేశ్వర్



సీసీ కెమెరా

నగరి: జనాభా పెరుగుదలతో పాటు పట్టణాలు విస్తరిస్తుండడంతో భద్రతా అంశంలో పోలీసులతో పాటు ప్రజలు కూడా తమ సహకారాన్ని అందించాలని పోలీసు శాఖ సూచిస్తోంది. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని, అందులో భాగంగా అత్యాధునిక నిఘా నేత్రాలను ఇళ్ల వద్ద, దుకాణాల వద్ద ఏర్పాటు చేసుకోవాలని కోరుతోంది. ×విజిబుల్ పోలిసింగ్×తో చోరీలకు, నేరాలకు పాల్పడే వారిని త్వరితగతిన పట్టుకునేందుకు వీలుంటుందని తద్వారా నేరాలను అదుపుచేయవచ్చని భావిస్తోంది. దీంతో జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు పోలీసులు నిఘా నిమిత్తం నూతనంగా సిద్ధం చేసిన సీసీ కెమెరాల ఆవశ్యకతను ప్రజలకు, దుకాణదారులకు వివరించే ప్రయత్నాలు చేపట్టారు. ఇదివరలో ఉపయోగించిన ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలు నేరాల నియంత్రణలో సాయపడుతూ వచ్చాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నూతన సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా అమర్చబడిన సీసీ టీవీ కెమెరాలు మరింత ప్రభావవంతంగా పనిచేస్తున్నాయని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. సాంకేతికతను సరైన విధంగా ఉపయోగించడంతో ప్రజలు తమ ఆస్తులను కాపాడుకోవడంలో ఒక భాగమవుతారు. ప్రజల సహకారం ఉన్నప్పుడే సమాజం భద్రంగా ఉంటుంది. కొంత ఖర్చుతో కూడినదే అయినా భద్రతా పరంగా అది అవసరం కనుక ఏర్పాటు చేసుకోకతప్పదు.

నేర నియంత్రణలో సీసీ కెమెరాలు

అనుమానితులను గుర్తించడంలో, నేర స్థలాలను పర్యవేక్షించడంలో, సాక్ష్యాలను సేకరించడంలో సీసీ కెమెరాలు ప్రధాన భూమికను పోషిస్తాయి. కెమెరాల ద్వారా పొందిన సాక్ష్యాలు న్యాయ ప్రక్రియలో కీలకంగా ఉంటాయి. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించేవారిని గుర్తించడంలో, పట్టణ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పర్యవేక్షించడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. ప్రస్తుత సమాజంలో సీసీ కెమెరా నిత్యసహాయక సాధనమే.

పలు రకాల సీసీ కెమెరాలు

ఏదో ఒక సీసీ కెమెరాను ఇళ్లకు, దుకాణాలకు అమర్చడంలో ప్రయోజనం ఉండదు. ఎలాంటి కెమెరాలు వాడితే అత్యధిక ప్రయోజనం ఉంటుందో పోలీసులు పలు సూచనలు ఇస్తున్నారు. వారు అందించిన సూచనల మేరకు బయటి వైపు ఉంచే కెమెరాల్లో టేపో క్రిస్టల్ క్లియర్ 2కె క్యూహెచ్‌డీ పరిజ్ఞానం ఉన్న స్మార్ట్ హోమ్ సెక్యూరిటీ కెమెరాలు అమర్చుకోవాలి. ఈ కెమెరాల్లో నైట్ విజన్, మోషన్ డిటెక్షన్, టూవే ఆడియో, స్టోరేజ్ ఆప్షన్, ఎలక్ట్రానిక్ పాన్ సౌకర్యాలు ఉంటాయి. దీంతో నేరస్తులను సులభంగా పట్టుకోవచ్చు. అలాగే లోపలవైపు ఉంచే కెమెరాల్లో పాన్ సెక్యూరిటీ వైఫై స్మార్ట్ పరిజ్ఞానంగానీ, 4జీ సిమ్ ఆధారంగా వైఫైతో పనిచేసే 3ఎంపీ స్మార్ట్ కేమెట్ హైబ్రిడ్ పరిజ్ఞానం గానీ ఉండాలి. ఈ కెమెరాల్లో పాన్ ఫీచర్, హై రెజల్యూషన్, వైఫై కనెక్టివిటీ, నైట్ విజన్, టూవే ఆడియో ఉంటుంది. ఇవి దుకాణాలకు ఉపయోగపడుతాయి. ఊరికి దూరంగా వైఫై సదుపాయం లేని ఇళ్లకు సోలార్ 4జి సిమ్, 4ఎంపీ పాన్, టిల్ట్ జూమ్ సదుపాయం ఉన్న సీసీ టీవీ కెమెరాలు వాడాలి. ఇది సిమ్ సపోర్టుతో పనిచేస్తుంది. వాటర్ ప్రూఫ్ సౌకర్యం ఉంటుంది. రికార్డింగ్ చేసే అంశాలు స్పష్టంగా ఉంటాయి. జూమ్ సౌకర్యం కూడా ఉంటుంది. ఈ పరిజ్ఞానంతో కార్లలో, బైక్‌లలో కూడా కెమెరాలు వినియోగించుకోవచ్చు.



సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా



పోలీసు శాఖ సూచించిన కెమెరాలను ఇంటి వద్ద, దుకాణాల వద్ద ఏర్పాటు చేసుకోవాలి. ఇది ప్రజల భద్రతలో ఒక భాగమే అని గుర్తించి ప్రజలు సహకారం అందించాలి. ఇప్పటికే భద్రతలో భాగంగా డయల్ 100, 112, వాట్సాప్ నెంబర్ 94409 00005, ఎల్‌హెచ్‌ఎంఎస్‌లు వాడుకలో ఉన్నాయి. పటిష్ట భద్రతకోసం సాంకేతిక పరిజ్ఞానం వాడుకోవాలన్నదే పోలీసు శాఖ ఆలోచన. కెమెరాల ఏర్పాటు కోసం కొంత ఖర్చు చేసినా దాని ప్రయోజనం ఎంతో ఉంటుందని గృహస్తులు, దుకాణదారులు తెలుసుకోవాలి. వాహనాలకు కూడా ఏర్పాటు చేసుకుంటే చోరీ అయ్యే సమయంలో సులభంగా పట్టుకోవచ్చు. కెమెరాల ఏర్పాటులో ఏవైనా సందేహాలు ఉంటే పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంప్రదిస్తే వివరాలు చెబుతాం. ఆ కెమెరాలన్నీ మార్కెట్‌లో సులభంగానే లభిస్తాయి. – మహేశ్వర్, సీఐ, నగరి

ఎయిడ్స్‌పై అవగాహన

ఐరాల: హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కాణిపాకం పీహెచ్‌సీ వైద్యాధికారి స్వాతి సింధూర అన్నారు. మంగళవారం కాణిపాకం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ కోర్ ఎన్‌జీఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ, సురక్షితం కాని లైంగిక సంబంధాలు, వ్యాధిగ్రస్తుల రక్తాన్ని మరొకరికి ఎక్కించడం వలన ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. వ్యాధిగ్రస్తులతో తిరిగినా వారి దుస్తులు ధరించినా వ్యాధి బారిన పడరన్నారు. ఎయిడ్స్ రోగులను చులకనగా చూడరాదన్నారు. పౌష్టికాహారం తీసుకుంటూ, ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే ఏఆర్‌టీ మందులను వైద్యుల సూచనలు, సలహాల మేరకు బాధితులు వాడితే ఆరోగ్యంగానే ఉంటారన్నారు. కోర్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.సద్దాం బాలికలకు గుడ్ టచ్..బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఓఆర్‌డబ్లూఎస్ దాక్షాయణి పాల్గొన్నారు.

జ్వర పీడితులను గుర్తించాలి

తవణంపల్లె: గ్రామాల్లో జ్వర పీడితులను గుర్తించి సకాలంలో చికిత్స అందేలా చూడాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశాడే సమావేశం నిర్వహించారు. ప్రియాంక మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్ కార్యక్రమం కింద పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలకు సక్రమంగా అందేలా చూడాలన్నారు. ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకంపై అవగాహన కల్పించాలని సూచించారు. బీసీజీ వ్యాక్సినేషన్ వేగవంతం చేయాలన్నారు.